సాక్షి
పల్నాడు
గురువారం । 27 । జూన్ । 2024



అంకమ్మతల్లి ఆలయంలో పూజలు

యడ్లపాడు: యడ్లపాడు కాటి అంకమ్మతల్లి గుడిలో బుధవారం ఎన్‌డీఏ కూటమి నేతలు అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. 516 కొబ్బరికాయలు కొట్టి మొక్కు తీర్చుకున్నారు.



విత్తన దుకాణాల తనిఖీ

కాకుమాను: కాకుమానులోని పలు విత్తన విక్రయ దుకాణాలను బుధవారం ఏఓ కె.కిరణ్మయి తనిఖీ చేశారు. స్టాకు వివరాలు, లైసెన్సులు పరిశీలించారు.

పంచముఖ ఆంజనేయునికి ప్రత్యేక పూజలు



నరసరావుపేట ఈస్ట్: సత్తెనపల్లిరోడ్డులోని అయ్యప్పస్వామి ఆలయ ఆవరణలోని పంచముఖ ఆంజనేయస్వామి ఆలయ 20వ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

29న జాతీయ లోక్‌అదాలత్


మాచర్ల: రాష్ట్ర న్యాయసేవా సాధికార సంస్థ హైకోర్టు, జిల్లా కోర్టు ఆదేశాల మేరకు ఈనెల 29న మాచర్ల సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నామని మాచర్ల న్యాయసేవా సాధికార సంస్థ చైర్మన్, సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ బుధవారం తెలిపారు. లోక్ అదాలత్‌లో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్, సివిల్, మనోవర్తి, చెక్‌బౌన్స్, బ్యాంకులకు సంబంధించిన, రెవెన్యూ, ప్రీ లిటిగేషన్ కేసులను పరిష్కరించుకోవచ్చన్నారు. మాచర్ల పరిధిలోని కక్షిదారులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని కేసులను పరిష్కరించుకోవాలన్నారు.

అందుబాటులో ఎల్‌సీఏ 643 మిరప విత్తనాలు



నరసరావుపేట: గుంటూరు లాం ఫామ్ ఉద్యాన పరిశోధనా కేంద్రంలో అభివృద్ధి చేసిన ఎల్‌సీఏ 643 రకం మిరప విత్తనాలు అమ్మకానికి అందుబాటులో ఉన్నట్లుగా లాం ఫామ్ ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ గిరిధర్ తెలియచేసినట్లు జిల్లా ఉద్యానశాఖ అధికారి సీహెచ్.వి.రమణారెడ్డి బుధవారం పేర్కొన్నారు. వీటి ధర కిలో రూ.1200లు అన్నారు. ఇది బైడిగి రకాన్ని పోలి ఉండే సూటిరకమని, నల్లతామర, బొబ్బర పురుగులను తట్టుకునే గుణం ఈ రకానికి ఉందన్నారు. జిల్లా రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని, ఇతర వివరాలకు 73826 33661 సంప్రదించాలని కోరారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం బుధవారం 504.20 అడుగుల వద్ద ఉంది. ఎస్‌ఎల్‌బీసీకి 800 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం జలాశయ నీటిమట్టం 815.10 అడుగుల వద్ద ఉంది.

మహంకాళీ అమ్మవారి ఆదాయం రూ.12.10 లక్షలు



తాడేపల్లిరూరల్ : కంతంరాజు కొండూరు గ్రామంలోని మహంకాళీ అమ్మవారి దేవస్థాన హుండీ లెక్కింపు కార్యక్రమం బుధవారం ఉదయం 10 గంటలకు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వహణాధికారి డి.సిహెచ్. వెంకటరెడ్డి మాట్లాడుతూ మహంకాళీ అమ్మవారి దేవస్థానంలోహుండీ కానుకల లెక్కింపు కార్యక్రమం గుంటూరు దేవాదాయ శాఖ, ఆంజనేయస్వామి దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె. వీరాంజనేయులు, దేవస్థాన వ్యవస్థాపక ధర్మకర్త డి.రంగప్రసాద్ పర్యవేక్షణలో జరిగిందని, హుండీలు లెక్కించగా రూ.12,10,467 వచ్చిందని, గత మార్చి నెలలో హుండీ లెక్కించగా రూ. 11,51,564లు వచ్చిందని, గతంలో కన్నా ప్రస్తుతం రూ. 58,903 ఆదాయం పెరిగిందని, ఈ ధనాన్ని ఆలయ అభివృద్ధికి ఖర్చు చేస్తామని వివరించారు.

యార్డులో 47,926 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు బుధవారం 44,834 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 47,926 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.8,500 నుంచి రూ. 17,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.7,500 నుంచి 20,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం మిర్చి రూ. 8,500 నుంచి రూ. 17,000 వరకు లభించింది. ఏసీ ప్రత్యేక రకం రూ. 8,000 నుంచి రూ. 19,600 వరకు ధర పలికింది. తాలు రకం మిర్చికి రూ.4,500 నుంచి రూ.12,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 16,301 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నతశ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

వ్యవసాయం.. అనుమానం

- ఏడాదికి రూ. 20 వేలు ఇస్తామన్న సీఎం చంద్రబాబు
- ప్రస్తుత ఖరీఫ్‌కు పీఎం కిసాన్ నగదు రూ.2వేలు మాత్రమే జమ
- గత ప్రభుత్వంలో రైతులకు రూ. 255.30 కోట్లు అందజేత
- గత ప్రభుత్వంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా ఒకే సారి జమ
- నియోజకవర్గంలో ఖరీఫ్‌లో సాధారణ సాగు 1,16,412 ఎకరాలు

రైతులకు నేటికీ అందని పెట్టుబడి



సత్తెనపల్లి: అడపాదడపా కురుస్తున్న వర్షాలతో రైతన్నలు ఖరీఫ్ సాగుకు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద తొలి విడత సాయంగా రైతుల ఖాతాల్లో రూ. 2 వేలు చొప్పున జమ చేసింది. సాగుకు సిద్ధమవుతున్న రైతులు ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలుకు ఈ మొత్తం కాస్త సహాయ పడుతుంది. సత్తెనపల్లి నియోజకవర్గంలో సుమారు 30 వేల మంది రైతులకు రూ. 6 కోట్లు బ్యాంక్ ఖాతాలో జమయ్యాయి. ఈ మొత్తం కేంద్ర వాటా కాగా .. రాష్ట్ర ప్రభుత్వం చేసే సహాయం కోసం రైతాంగం ఎదురు చూస్తోంది.

నాడు ఖరీఫ్ ఆరంభంలోనే..

సాగు పెట్టుబడి కోసం రైతులు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతోనే గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆరంభంలోనే పెట్టుబడి సాయం (వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్) అందిస్తూ వారికి అండగా నిలిచారు. పీఎం కిసాన్ సాయం రూ. 6 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ. 7,500 కలిపి ఏటా రూ. 13,500 మొత్తాన్ని ఖరీఫ్ ఆరంభంలో, కోతల సమయంలో, రబీ ఆరంభంలో లేదా ధాన్యం ఇంటికి చేరే సమయానికి మూడు విడతలుగా అందించేవారు. వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ కింద గత ఐదేళ్లలో సత్తెనపల్లి నియోజకవర్గంలో1,94,257 మంది రైతులకు రూ.255.30 కోట్లు అందించారు. భూ యజమానులకు మాత్రమే పీఎం కిసాన్ వర్తించగా .. ఎలాంటి భూమిలేని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన కౌలు రైతులతోపాటు దేవాదాయ, అటవీ, వక్ఫ్ బోర్డు భూములు కౌలు కింద సాగు చేసే రైతులకు రైతు భరోసా సాయం కింద పెట్టుబడి సాయాన్ని అందించేది.

రాష్ట్ర సాయం కోసం ఎదురుచూపులు...

ఖరీఫ్ పనులు ప్రారంభం కావడంతో విత్తనాలు, పొలం పనులకు డబ్బులు అవసరం అవుతున్నాయి. గతంలో పీఎం కిసాన్‌తో పాటు రైతు భరోసా ఒకేసారి అందడంతో పెట్టుబడి కింద ఆ మొత్తం ఉపయోగపడేది. ఇప్పుడు రూ. 2 వేలు మాత్రమే అందడంతో అది ఏం సరిపోదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తాము అధికారంలోకి వస్తే రూ. 20 వేలు అందజేస్తామని టీడీపీ ఎన్నికల మేనిఫెస్టోలో ప్రకటించింది. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టిన తర్వాత ఐదు ఫైళ్లపై సంతకాలు చేశారు. కానీ రైతు పెట్టుబడి సాయంపై సంతకం చేయలేదు. ఇంతవరకు దీనిపై ప్రకటనా లేదు.

అప్పులతో ప్రారంభం...

నియోజకవర్గంలో ఖరీఫ్ సాధారణ విస్తీర్ణం 1,16,412 ఎకరాలు. దీనిలో వరి, పత్తి, మిరప, ఇతర పంటలు సాగు అవుతాయి. ఈ ఏడాది ఖరీఫ్ రైతన్నలకు అప్పులతో ప్రారంభమవుతోంది. రైతు పంట పండించేందుకు ఎకరాకు కనీసం రూ. 15 నుంచి రూ. 20 వేలు అవసరం. భూమిని సిద్ధం చేయడానికి ట్రాక్టర్ దుక్కులు, విత్తనాలు, కూలీలకు, పంట సాగుకు, మందులు అవసరం అవుతాయి. పత్తి విత్తనాలకు మంచి డిమాండ్ ఉండడంతో పాటు అప్పు ఇచ్చే పరిస్థితి లేదు. గతంలో ప్రభుత్వం కొంత సొమ్ము జమ చేస్తే మిగిలిన సొమ్మును రైతు సరిచేసుకొని సాగు చేసేవారు. నేడు రైతు పెట్టుబడులకు చేతిలో సొమ్ము లేక అప్పులు చేయాల్సిన పరిస్థితి వచ్చింది.

నియోజకవర్గంలో గత ఐదేళ్లలో రైతుభరోసా, పీఎం కిసాన్ లబ్ధి ఇలా...

సంవత్సరం	లబ్ధిదారులు	నగదు(రూ.కోట్లలో)
2019–20	38,263	51.66
2020–21	39,560	53.41
2021–22	37,891	51.15
2022–23	37,412	52.94
2023–24	41,131	46.14
మొత్తం	1,94,257	255.30

సీసీఆర్‌సీ కార్డులతో కౌలు రైతులకు మేలు

డీఏఓ ఐ.మురళి



సీసీఆర్‌సీ కార్డులు పంపిణీ చేస్తున్న డీఏఓ

నరసరావుపేట రూరల్: పంట సాగు హక్కు పత్రాలతో(సీసీఆర్‌సీ) కౌలు రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ అధికారి ఐ.మురళి తెలిపారు. మండలంలోని కేసానుపల్లిలో బుధవారం భూ యజమానులు, కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. డీఏఓ మురళి పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. కౌలు రైతులు పంటసాగు హక్కు పత్రాల కోసం వ్యవసాయ సహాయకుడిని, గ్రామ రెవెన్యూ అధికారి వద్ద దరఖాస్తు చేసుకోవాలన్నారు. గ్రామ రెవెన్యూ అధికారి క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులైన కౌలు రైతులకు పంటసాగు హక్కు పత్రాన్ని అందజేస్తారని తెలిపారు. పంట సాగు హక్కు పత్రం కేవలం 11 నెలలు మాత్రమే కౌలు రైతులకు ఉపయోగపడుతుందన్నారు. భూ యజమానులకు వారి హక్కులపై ఎలాంటి భంగం వాటిల్లదని స్పష్టంచేశారు. సీసీఆర్‌సీ కార్డుల ద్వారా పంట నమోదు చేసుకున్న రైతులకు పంటల బీమా వర్తిస్తుందన్నారు. ప్రకృతి వైపరీత్యాల వలన సంభవించే పంట నష్ట పరిహారం పొందవచ్చని తెలిపారు. పంట ఉత్పత్తులను మద్దతు ధరకు విక్రయించేందుకు సీసీఆర్‌సీ కార్డు ఉపయోగపడుతుందన్నారు. ఏడీఏ మస్తానమ్మ మాట్లాడుతూ పచ్చిరొట్ట విత్తనాలను ఐదు శాతం సబ్సిడీపై రైతులకు అందజేస్తున్నట్టు తెలిపారు. కౌలు రైతులు జాయింట్ లయబిలిటీ గ్రూప్(జేఎల్‌జీ)గా ఏర్పడితే బ్యాంకుల నుంచి రుణాలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ నరేంద్రబాబు, ఏఈఓ కె.బ్రహ్మయ్య, వీఏఓ షేక్ సాయిబాబు, వీఆర్‌ఓ కె.రత్నకుమారి, కౌలు రైతు సంఘం నాయకులు కామినేని రామారావు తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు లేని మిరప విత్తనాలు స్వాధీనం

- యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో గుంటూరు రీజినల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారుల దాడులు
- రెండు షాపుల్లో రూ.4,78,953 విలువైన మిరప విత్తనాలు గుర్తింపు



యడ్లపాడులోని ఓ విత్తన దుకాణంలో తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

యడ్లపాడు: గుంటూరు రీజినల్ విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు బృందం నేతృత్వంలో పలు విత్తనాల విక్రయ దుకాణాల్లో బుధవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. విజిలెన్స్ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ జనరల్ ఆదేశాల మేరకు యడ్లపాడు, నాదెండ్ల మండలాల్లో అనుమతులు లేని విత్తనాలను విక్రయిస్తున్నారనే సమాచారంతో ఈ దాడులు చేసినట్లు అధికారులు వెల్లడించారు. గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి కె.ఈశ్వరరావు పర్యవేక్షణలో ఆయా మండలాల వ్యవసాయ అధికారులతో కలిసి విస్తృత సోదాలు చేశారు. ఈ తనిఖీల్లో యడ్లపాడు, నాదెండ్ల మండల కేంద్రాల్లోని రెండు షాపుల్లో అనుమతి పత్రాలు లేని రూ.4,78,953 విలువైన 5 కేజీల ప్యాకెట్లను అధికారులు గుర్తించారు. అత్యధికంగా యడ్లపాడు శ్రీసాయినాథ సీడ్స్‌షాపులో రూ.4,31,703 విలువ గల హైబ్రీడ్ మిరప విత్తనాలు, అలాగే నాదెండ్లలో శ్రీహర్ష సీడ్స్ షాపులో రూ.47,250 విలువైన హైబ్రీడ్ మిరప విత్తనాల నిల్వల్ని గుర్తించారు. 1983 సీడ్ కంట్రోల్ ఆర్డర్ ప్రకారం వాటి విక్రయాలను నిలుపుదల చేసినట్లు వెల్లడించారు. ఈ దాడుల్లో గుంటూరు రీజినల్ విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ వ్యవసాయ అధికారి కె.రమణకుమార్, సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.రామచంద్రయ్య, రెండు మండలాల ఏఓలు సీహెచ్ సరిత, హరిప్రసాద్ పాల్గొన్నారు.

మత్తు జోలికి వెళ్లొద్దు

- సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు
- పల్లెగుంత ఆదర్శ పాఠశాలలో మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం



ఏపీ మోడల్ స్కూల్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు

గురజాల: మత్తు పదార్థాల జోలికి ఎవరూ వెళ్లవద్దని, వెళ్లి జీవితాలను నాశనం చేసుకోవద్దని సీనియర్ సివిల్ జడ్జి వై.శ్రీనివాసరావు సూచించారు. మండల పరిధిలోని పల్లెగుంత గ్రామంలోని ఏపీ మోడల్ పాఠశాలలో అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. సీనియర్ సివిల్ జడ్జి మాట్లాడుతూ విద్యార్థి దశలోనే చాలామంది మత్తు పదార్థాలకు బానిసలవుతున్నారని, మత్తు పదార్థాల సేవనంతో భవిత చిత్తు అవుతుందన్నారు. విద్యార్థులకు ఎన్‌డీపీఎస్ చట్టంపై అవగాహన కల్పించారు. అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ బండి వీరభద్రుడు, సీనియర్ న్యాయవాది షేక్ జానీబాష, గురజాల ఎస్ఐ సౌందర్ రాజన్ విద్యార్థులు పాల్గొన్నారు.

వాగ్దేవి కళాశాలలో..

డ్రగ్స్‌కు బానిసలై జీవితాలను నాశనం చేసుకోవద్దని సెబ్ సీఐ వెంకటరమణ విద్యార్థులకు సూచించారు. స్థానిక వాగ్దేవి కళాశాలలో బుధవారం అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవంలో భాగంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. బడిదెల శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి..

మాచర్ల: ప్రతి విద్యార్థి చిన్ననాటి నుంచి చెడు అలవాట్లకు దూరంగా ఉండి, క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని మాచర్ల కోర్టు అదనపు జూనియర్ సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ అన్నారు. పట్టణంలోని ఎస్‌వీఆర్ డిగ్రీ కాలేజీలో బుధవారం మదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సివిల్ జడ్జి శ్రీనివాస్ కల్యాణ్ హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో యువత చెడు వ్యసనాలకు అలవాటు పడి భవిష్యత్తు నాశనం చేసుకుంటున్నారన్నారు. భావితరాలు అభివృద్ధి చెందాలంటే విద్య ఒక్కటే మార్గమన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ వై.వెంకట్రామయ్య, మాచర్ల కోర్టు ప్రభుత్వ ప్లీడర్ జి.వెంకటేశ్వర్లు, సీనియర్ న్యాయవాది జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

అనుమానమే పెనుభూతమై..

గొంతునులిమి భార్యను హతమార్చిన భర్త



మృతురాలు మేడా సాయిభవాని

చిలకలూరిపేట: అనుమానమే పెనుభూతమై కట్టుకున్న భార్యను భర్త గొంతునులిమి హత్య చేసిన ఘటన పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో చోటు చేసుకుంది. మృతురాలి బంధువులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మేడా సాయి భవాని(19) భర్త కనపర్తి సురేష్‌తో కలసి పట్టణానికి మంచినీరు సరఫరా చేసే చెరువుల మార్గంలో ఉన్న టిడ్కో గృహ సముదాయంలో ఉంటోంది. ఆమెకు మొదటగా నాలుగేళ్ల కిందట మీసాల పృథ్వీతో వివాహం జరిగింది. కుటుంబ కలహాల నేపథ్యంలో విడాకులు తీసుకున్నారు. అనంతరం ఏడాది కిందట కనపర్తి సురేష్‌తో రెండో వివాహం జరిగింది. ఈ నేపథ్యంలో సురేష్ గత కొంతకాలంగా సాయిభవాని తన మొదటి భర్తతో ఫోన్‌లో మాట్లాడుతుందంటూ అనుమానం వ్యక్తం చేస్తూ వేధించసాగాడు. ఈ నేపథ్యంలోనే మంగళవారం రాత్రి మాట్లాడాలని చెప్పి తన భార్యను టిడ్కో గృహ సముదాయానికి దూరంగా ఉన్న పొలాల్లోకి తీసుకువెళ్లి గొంతు నులిమి హతమార్చాడు. మృతురాలి బంధువులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చిలకలూరిపేట రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. సంఘటన అనంతరం నిందితుడు పోలీసులకు లొంగిపోయినట్లు సమాచారం.

నేటి నుంచి ఈ–సెట్ కౌన్సెలింగ్

- 30 వరకు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపునకు అవకాశం
- ఆన్‌లైన్‌లోనే విద్యార్థుల ధ్రువపత్రాల పరిశీలన
- ధ్రువపత్రాల్లో తప్పలుంటేనే కౌన్సెలింగ్ కేంద్రానికి రావాలి
- గుంటూరు జిల్లాలో ఒక హెల్ప్‌లైన్ కేంద్రం ఏర్పాటు
- జూలై ఒకటి నుంచి కళాశాలల ఎంపిక కోసం వెబ్ కౌన్సెలింగ్



విద్యార్థుల సర్టిఫికెట్ల పరిశీలన (ఫైల్)

గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ విద్యార్హతతో బీటెక్ ద్వితీయ సంవత్సరంలో ప్రవేశం కోసం ఉద్దేశించిన ఏపీ ఈసెట్–2024 కౌన్సెలింగ్ గురువారం ప్రారంభం కానుంది. ఇందులో భాగంగా ఈ–సెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులకు బుధవారం ప్రారంభమైన ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపు, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఈనెల 30 వరకు కొనసాగనుంది. ఏపీఈసెట్–2024లో అర్హత సాధించి, కళాశాలల్లో చేరేందుకు ఎదురుచూస్తున్న విద్యార్థులు రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ విడుదల చేసిన మార్గదర్శకాల మేరకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాల్సి ఉంది. విద్యార్థులెవ్వరూ భౌతికంగా హెల్ప్‌లైన్ కేంద్రాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ఆన్‌లైన్‌లోనే ధ్రువపత్రాల పరిశీలనకు ఏర్పాట్లు చేశారు. ఈనెల 30వ తేదీలోపు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లించిన విద్యార్థుల ధ్రువపత్రాలను మరుసటి రోజున సంబంధిత హెల్ప్‌లైన్ కేంద్రాలకు ఆన్‌లైన్‌లో చేరతాయి. సంబంధిత హెల్ప్‌లైన్ కేంద్రంలోని అధికారులు విద్యార్థులు అప్‌లోడ్ చేసిన ధ్రువపత్రాలను ఆన్‌లైన్‌లోనే పరిశీలించి, ఆమోదిస్తారు. ధ్రువపత్రాల పరిశీలన అసంపూర్తిగా ఉన్న విద్యార్థులకే హెల్ప్‌లైన్ కేంద్రంలో భౌతికంగా సర్టిఫికెట్ల పరిశీలన చేస్తారు. ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిన విద్యార్థులు జూలై 1,2,3,4వ తేదీల్లో ఆన్‌లైన్ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొని కళాశాలల ఎంపికకు ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.

ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లింపుతో మొదలయ్యే ప్రక్రియ

- ఏపీ ఈసెట్–2024లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు ఆన్‌లైన్‌లో ప్రాసెసింగ్ ఫీజు చెల్లింపుతో పాటు రిజిస్ట్రేషన్ చేసుకోవాల్సి ఉంది. సెట్స్.ఏపీఎస్‌సీహెచ్ఈ.ఏపీ.జీవోవీ.ఇన్ సైట్ ద్వారా ఈసెట్–2024కు లాగిన్ అయ్యి ఈసెట్ హాల్‌టికెట్, జనన తేదీ వివరాలతో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. రిజిస్ట్రేషన్ సమయంలో ప్రాసెసింగ్ ఫీజు రూపంలో ఓసీ, బీసీ విద్యార్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.600 చొప్పున ఆన్‌లైన్ పేమెంట్ గేట్‌వే ద్వారా చెల్లించాలి.
- ఏపీ ఈసెట్‌లో ర్యాంకులు సాధించిన విద్యార్థులు హెల్ప్‌లైన్ కేంద్రాలకు విధిగా వెళ్లాల్సిన అవసరం లేదు. ఎందుకంటే ఈసెట్‌కు దరఖాస్తు చేసే సమయంలోనే విద్యార్థులు సమర్పించిన టెన్త్, పాలిటెక్నిక్ మార్కుల జాబితాలు, సామాజికవర్గ, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల పరిశీలన ప్రక్రియను సాంకేతిక విద్యాశాఖ వెబ్‌బేస్డ్ విధానంలో పూర్తిచేసింది.
- ఈసెట్ రిజిస్ట్రేషన్ సమయంలో హాల్‌టిక్కెట్ నంబరు, జననతేదీ వివరాలను సబ్మిట్ చేసిన విద్యార్థుల ధ్రువపత్రాలకు సంబంధించిన వివరాలు కంప్యూటర్ స్క్రీన్‌పై ప్రత్యక్షమవుతాయి. ఆన్‌లైన్‌లో ధ్రువపత్రాల పరిశీలన విజయవంతంగా పూర్తయిందని డిస్‌ప్లేలో ప్రత్యక్షమైతే, సంబంధిత విద్యార్థులు షెడ్యూల్ ప్రకారం నేరుగా వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకోవాలి.
- క్యాండిడెట్ ఈజ్ నాట్ ఎలిజిబుల్ ఫర్ ఎక్సర్‌సైజ్ ఆప్షన్స్ అని వస్తే, సంబంధిత ధ్రువపత్రాలతో హెల్ప్‌లైన్ కేంద్రంలో పరిశీలనకు హాజరు కావాల్సి ఉంటుంది.
- సర్టిఫికెట్ వెరిఫికేషన్ పురోగతిలో ఉన్నట్లు డిస్‌ప్లే అయిన పక్షంలో విద్యార్థులు వెబ్ ఆప్షన్ల నమోదుకు సిద్ధంగా ఉండాల్సి ఉంది.
- గుంటూరు శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో హెల్ప్‌లైన్ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను ఉపేక్షించం

గుంటూరు జాయింట్ కలెక్టర్ రాజకుమారి

గుంటూరు వెస్ట్: ప్రజా పంపిణీ వ్యవస్థలో లోపాలను ఉపేక్షించబోమని జాయింట్ కలెక్టర్ జి.రాజకుమారి స్పష్టం చేశారు. బుధవారం పట్టణంతోపాటు శివారు ప్రాంతాల్లోని ఎంఎల్‌ఎస్ పాయింట్లు, గ్యాస్ ప్లాంట్లను జేసీ సిబ్బందితో ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆమె మాట్లాడుతూ ఎంఎల్‌ఎస్ పాయింట్ల నుంచి నిత్యం రేషన్ దుకాణాలకు సరుకుల పంపిణీ జరుగుతుందని, వాటి వివరాలు, తూనికలు పారదర్శకంగా ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిపై ఉందన్నారు. వసతి గృహాలకు సంబంధించి సరఫరా చేసే సరుకులు నాణ్యంగా ఉండాలని చెప్పారు. ఈ విషయంలో ఎంఎల్‌ఎస్ పాయింట్లతోపాటు సరుకు పంపిణీదారులు కూడా జాగ్రత్తగా వ్యవహరించాలన్నారు. గ్యాస్ ఏజెన్సీలు తమ గోడౌన్లలో అన్ని భద్రతా ఏర్పాట్లు నిత్యం పరిశీలించుకోవాలని చెప్పారు. ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. సివిల్ సప్లెస్ డీఎం జి.లక్ష్మి పాల్గొన్నారు.

పౌరసరఫరాల గోదాముల పరిశీలన..

గుంటూరు రూరల్: జిల్లాలోని పలు పౌరసరఫరాల గోదాములు దుకాణాలను పౌరసరఫరాలు, జాయింట్ కలెక్టర్ రాజకుమారి బుధవారం ఆకస్మికం తనిఖీ చేశారు. జిల్లాలోని గుంటూరు రూరల్, అర్బన్, ప్రాంతాల్లోని ఎమ్ఎల్ఎస్ పాయింట్లను, సందర్శించారు. స్టాక్ వివరాలను పరిశీలించారు.



రేషన్ బియ్యం గోదాములను పరిశీలిస్తున్న జేసీ

డయేరియాను పూర్తిస్థాయిలో అరికట్టాలి

బాపట్ల ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీధర్

బాపట్ల: డయేరియాను పూర్తిస్థాయిలో అరికట్టేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ సీహెచ్ శ్రీధర్ ఆదేశించారు. డయేరియా నిర్మూలనపై మండల స్థాయి అధికారులతో బుధవారం స్థానిక కలెక్టరేట్ నుంచి ఆయన బుధవారం టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజల్లో అవగాహన కల్పించడంతోనే వ్యాధిని నిర్మూలించగలమని తెలిపారు. రాష్ట్రంలో ఐదేళ్లలోపు చిన్నారులు డయేరియా సోకి ప్రతి ఏటా 5. 8 శాతం మంది మృతి చెందుతున్నారని వివరించారు. గతేడాది జిల్లాలో 175 కేసులు నమోదయ్యాయన్నారు. చిన్నారుల్లో డయేరియా మరణాల్ని పూర్తిస్థాయిలో అరికట్టాలని ఆదేశించారు.

మాదక ద్రవ్యాలతో భవిష్యత్తు అంధకారం

సత్తెనపల్లి డీఎస్పీ గుర్‌నాథ్‌బాబు

సత్తెనపల్లి: మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం చేసుకోవద్దని, విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్‌బాబు అన్నారు. ప్రపంచ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్), హెల్ప్ ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇంటర్ స్థాయిలో కొంతమేరకు అవగాహన కలిగి నడుచుకోవాలన్నారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాలు, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. క్రమశిక్షణ, పట్టుదలతో చదివి ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. గంజాయికి బానిసలుగా మారి యువత భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని, దానివల్ల తల్లిదండ్రులు మానసిక క్షోభకు గురవుతున్నారన్నారు. సత్తెనపల్లి టౌన్ సీఐ పోలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గంజాయి, మత్తు, మాదకద్రవ్యాలకు అలవాటు పడితే జీవితం మరణ శాసనంగా మారుతుందని, మత్తుకు అలవాటు పడినవారు శారీరకంగా, మానసికంగా, అనారోగ్యాలకు గురవుతారన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్ మెంట్ బ్యూరో సత్తెనపల్లి సీఐ ఇ.అరుణకుమారి మాట్లాడుతూ ప్రస్తుత ప్రపంచంలో ఉగ్రవాదం తర్వాత అంతటి సవాలుగా ఈ మాదక ద్రవ్యాల వినియోగ సమస్య పరిణామం చెందిందన్నారు. సదస్సుకు కళాశాల ప్రిన్సిపల్ కోటేశ్వరమ్మ అధ్యక్షత వహించారు. తొలుత ర్యాలీని సత్తెనపల్లి డీఎస్పీ జి.గురునాథ్‌బాబు జెండా ఊపి ప్రారంభించారు. విద్యార్థులు డ్రగ్స్ వద్దు .. జీవితం ముద్దు అంటూ నినాదాలు చేశారు. మాదక ద్రవ్యాలు, మత్తు పదార్థాల జోలికి వెళ్లబోమని ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సత్తెనపల్లి టౌన్ ఎస్ఐ ఎం.సంధ్యారాణి, హెల్ప్ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు కంచర్ల బుల్లిబాబు, టీచర్ మస్తాన్, ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ రమేష్, ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



సత్తెనపల్లిలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న డీఎస్పీ గుర్‌నాథ్‌బాబు, సీఐ శ్రీనివాసరావు, అరుణకుమారి, ఎస్ఐ సంధ్యారాణి



నరసరావుపేటలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎక్సైజ్ శాఖ సిబ్బంది, పోలీసులు, విద్యార్థులు

నరసరావుపేటలో...

నరసరావుపేట టౌన్: పట్టణంలో బుధవారం ఎక్సైజ్, పోలీసు శాఖల ఆధ్వర్యంలో డ్రగ్స్ వద్దు, జీవితం ముద్దు అనే నినాదంతో యాంటీ డ్రగ్స్‌డే ర్యాలీ నిర్వహించారు. పల్నాడు బస్టాండ్ సెంటర్ నుంచి మల్లమ్మసెంటర్‌వరకు విద్యార్థులు నినాదాలు చేస్తూ కొనసాగారు. ఎక్సైజ్ ఈఎస్ షేక్ ఖాజామొహిద్దీన్, సీఐ నయనతార, వన్‌టౌన్, టూటౌన్ సీఐలు కృష్ణారెడ్డి, భాస్కర్, ఎస్ఐలు సతీష్, రోశయ్య, సిబ్బంది పాల్గొన్నారు.

విలువలతో కూడిన విద్యనభ్యసించాలి

తెనాలిరూరల్: పిల్లలు విలువలతో కూడిన విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాలు, అక్రమ రవాణా వ్యతిరేక దినం సందర్భంగా తెనాలి మండలం న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో తెనాలి గంగానమ్మపేటలోని గుప్తా డిగ్రీ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు బుధవారం నిర్వహించారు. న్యాయమూర్తి పవన్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు చెడు స్నేహాలకు ఆకర్షితులు కాకుండా విద్యపై దృష్టి పెట్టాలని, ఎంచుకున్న లక్ష్యాన్ని చేరుకునేందుకు కష్టపడాలని చెప్పారు. మాదక ద్రవ్యాల వినియోగం, రవాణా నేరమని చెప్పారు. చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కృష్ణ, న్యాయసేవాధికార సంస్థ సిబ్బంది మహబూబ్, యర్రంశెట్టి అనిల్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.



న్యాయ విజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న న్యాయమూర్తి పవన్‌కుమార్

నిరుద్యోగ యువతకు శిక్షణ, ఉపాధి

క్రోసూరు: ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో పల్నాడు జిల్లాలోని నిరుద్యోగ యువతీయువకులకు ఉచిత శిక్షణ, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు ఎంపీడీఓ కేవీ రమణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవతరగతి పాస్/ఫెయిలైన యువతీ యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉచిత శిక్షణ కోర్సుల వివరాలు..

నరసారావుపేట ఎస్ఎస్‌పీ కాలనీలోని ఎస్‌పీసీ సెంటర్‌లో కుట్టుమిషన్ ఆపరేటర్‌పై శిక్షణ, కో–ఆర్డినేటర్ ఎం.వీరాంజనేయులు (9160200652). వినుకొండ, ఎస్‌జీకే ప్రభుత్వ డిగ్రీకాలేజీలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్, కో–ఆర్డినేటర్, డి.జానీబాషా (9951214919). సత్తెనపల్లి, ప్రభుత్వ జూనియర్ కాలేజీలో కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ వాయిస్, కో–ఆర్డినేటర్ ఇ.రామకృష్ణారెడ్డి (8074393466). గురజాల, ప్రభుత్వ జూనియర్ కాలేజీ పిడుగురాళ్లలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్,కో–ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ (9492115853) మాచర్ల ఎస్‌కేబీఆర్ ప్రభుత్వ డిగ్రీకాలేజీలో డొమెస్టిక్ ఐటీ హెల్ప్ డెస్క్, కో–ఆర్డినేటర్ పి.కిరణ్‌నాయక్ (7842747682) పెదకూరపాడు మండలం క్రోసూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్ కోర్సు, కో–ఆర్డినేటర్ పి.శ్రీకాంత్ (9492115853).

కోర్సులలో చేరదలచిన అభ్యర్థులు ఆధార్, కులం, విద్య, ఫొటో, ధ్రువీకరణ పత్రాలు తీసుకుని ఆయా శిక్షణ కేంద్రాలలో స్కిల్ హబ్ కో–ఆర్డినేటర్లను సంప్రదించాలన్నారు.

పవర్ లిఫ్టర్ ఖాజావలికి అభినందన

చీరాల టౌన్: జాతీయ స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ చూపి పతకాలు సాధించి, చీరాల ఖ్యాతిని చాటిన లిఫ్టర్ ఎస్‌డీ ఖాజావలి క్రీడాకారులకు ఆదర్శనీయమని బాపట్ల జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ చైర్మన్ తాడివలస దేవరాజ్ అన్నారు. ఇటీవల పంజాబ్ రాష్ట్రంలోని పాటియాలలో జరిగిన జాతీయ పోటీల్లో వివిధ విభాగాల్లో చక్కని ప్రతిభచూపి రెండు బంగారు, రెండు వెండి పతకాలు సాధించిన ఖాజావలిని బుధవారం బాపట్ల జిల్లా పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా దేవరాజ్ మాట్లాడుతూ పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లకు చీరాల నెలవని, పలువురు జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో అనేక పతకాలు సాధించారని పేర్కొన్నారు. ఆగస్టులో యూరప్‌లో జరగనున్న అంతర్జాతీయ పవర్‌లిఫ్టింగ్ పోటీలకు ఖాజావలి ఎంపికవ్వడం చీరాలకే గర్వకారణమని తెలిపారు. అంతర్జాతీయ పోటీల్లో చక్కని ప్రతిభ చూపి పతకాలు సాధించి భారతదేశానికి, చీరాలకు మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. ఖాజావలికి తన వంతుగా సహకారాన్ని అందిస్తున్నానని, జిల్లాలోని ప్రతి ఒక్కరూ ముందుకురావాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

'పాలువాయిగేటు' కేసులో ఒకరికి ముందస్తు బెయిల్

రెంటచింతల: మండలంలోని పాలువాయిగేటు గ్రామంలో ఈ ఏడాది మే 13వ సార్వత్రిక ఎన్నికల సందర్భంగా టీడీపీ పోలింగ్ బూత్ ఏజెంటు నంబూరి శేషగిరిరావుపై దాడిచేసిన కేసులో నిందితుడు తురకా పట్టాభికి గురజాల 10వ అదనపు జిల్లా ప్రత్యేక కోర్టు ముందస్తు బెయిల్ మంజూరు చేసింది. శేషగిరిరావు తనపై 15 మంది దాడి చేసినట్లు ఫిర్యాదులో పేర్కొనగా వారిలో పట్టాభి 5వ నిందితుడిగా ఉన్నారు. తనకు కోర్టు మంజూరు చేసిన బెయిల్ ఫారాలను పట్టాభి బుధవారం పోలీసులకు అందజేసినట్లు ఏఎస్ఐ హనుమంతురావు తెలిపారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్టు

నరసరావుపేట టౌన్: భార్య ఆత్మహత్య కేసులో భర్త, అతని తల్లిదండ్రులను అరెస్ట్ చేసినట్లు టూ టౌన్ సీఐ భాస్కర్ బుధవారం తెలిపారు. ఐలా బజార్‌కు చెందిన తాటి పల్లవి (22) భర్త పూర్ణచంద్రరావు అతని తల్లిదండ్రులు అంకమ్మరావు, పద్మావతిల వేధింపులు తాళలేక గత నెల 27వ తేదీన ఆత్మహత్యకు పాల్పడింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు టూ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ క్రమంలో నిందితును అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తూ మృతురాలి కుటుంబ సభ్యులు మంగళవారం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట ఆందోళనకు దిగారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టులో హాజరుపర్చినట్లు వెల్లడించారు.

శ్రీకాకుళం-కడప మ్యాచ్ డ్రా

మంగళగిరి: అమరావతి క్రికెట్ స్టేడియంలో జరుగుతున్న ఏసీఏ అండర్–16 మల్టిడే ఇంటర్ డిస్ట్రిక్ట్ క్రికెట్ పోటీలలో కడప–శ్రీకాకుళం జట్ల మధ్య జరిగిన మ్యాచ్ డ్రా అయింది. బుధవారం జరిగిన రెండో ఇన్నింగ్స్‌లో బ్యాటింగ్ చేపట్టిన శ్రీకాకుళం జట్టు 72 ఓవర్లలో 100 పరుగులు చేసి ఆలౌటైంది. జట్టు బ్యాట్స్ మెన్ కె.చరిత్ 39 పరుగులు చేశాడు. కడప జట్టు బౌలర్ జి.గైలు నాలుగు వికెట్లు తీసి శ్రీకాకుళం జట్టును కట్టడి చేశాడు. అనంతరం బ్యాటింగ్ చేపట్టిన కడప జట్టు 2 ఓవర్లలో 1 వికెట్ కోల్పోయి 09 పరుగులు చేసింది. సమయం ముగియడంతో మ్యాచ్‌ను డ్రాగా ప్రకటించారు. తొలి ఇన్నింగ్స్‌లో శ్రీకాకుళం జట్టు ఆధిక్యత సాధించింది. ఓవరాల్‌గా శ్రీకాకుళం జట్టు 113.2 ఓవర్లలో 240 పరుగులు చేసి ఆలౌట్ కాగా కడప జట్టు 63 ఓవర్లలో 210 పరుగులు చేసి ఆలౌటైంది.



4 వికెట్లు తీసిన కడప జట్టు బౌలర్ గైలు

ఎన్ఎస్ కెనాల్ ఎంప్లాయిస్ సమస్యలు పరిష్కరించాలి

సత్తెనపల్లి: ఎన్ఎస్ కెనాల్ ఎంప్లాయిస్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని పీడబ్ల్యూడీ వర్క్‌షాప్ అండ్ కెనాల్స్ వర్కర్స్ యూనియన్ కేంద్ర కమిటీ కార్యదర్శి కంబాల శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. సత్తెనపల్లి ఓఅండ్ఎం డివిజన్ ఈఈ మురళీధర్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ గుంటూరు, బాపట్ల, ప్రకాశం జిల్లాల పరిధిలో తాగునీటి చెరువులు సుమారు 1500 పైగా ఉన్నాయన్నారు. వీటి మెయింటెనెన్స్‌కు 1500 మంది లస్కర్లు, వర్క్ ఇన్‌స్పెక్టర్లు, ఆపరేటర్స్ అవసరం కాగా ప్రస్తుతం 400 మంది సిబ్బంది మాత్రమే విధులు నిర్వహిస్తున్నారన్నారు. నాగార్జునసాగర్ డ్యామ్ మెయింటెనెన్స్‌కు 56 మంది అవసరం ఉండగా ప్రస్తుతం 10 మంది మాత్రమే పనిచేస్తున్నారని, ఎస్.ఎస్. డ్యామ్‌తో సహా 1100 మంది సిబ్బంది అవసరమన్నారు. ఆ ఖాళీలను వెంటనే భర్తీ చేయాలన్నారు. నాగార్జునసాగర్ కుడికాలువ పరిధిలో వర్క్‌చార్జ్‌డ్ సిబ్బందిని మెయింటెనెన్స్ సిబ్బందిగా ప్రభుత్వం గుర్తించిన దరిమిలా వర్క్ ఛార్జ్‌డ్ వ్యవస్థను రద్దుపరచి, ఉద్యోగుల జీతభత్యాలను 010 పద్దు ద్వారా చెల్లింపులు చేయాలన్నారు. పలు సమస్యలను వినతి పత్రంలో నమోదు చేసి పరిష్కరించాల్సిందిగా కోరామన్నారు. ఆయనతో పాటు ఏఐటీయూసీ సత్తెనపల్లి పట్టణ అధ్యక్షుడు డీఆర్ మస్తాన్, నాయకుడు నగేష్, పల్నాడు జిల్లా యువజన సంఘం నాయకుడు కె.ఆనంద్, తదితరులు ఉన్నారు.



సత్తెనపల్లి ఓఅండ్ఎం డివిజన్ ఈఈ మురళీధర్‌కు వినతిపత్రం అందిస్తున్న శ్రీనివాసరావు, తదితరులు

వానకు ముందు విత్తుతోనే రైతుకు లాభం

ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జి.అమలకుమారి

నరసరావుపేట రూరల్: వానకు ముందే విత్తటం వలన భూసారం పెరుగుతుందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ జి.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో బుధవారం సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్ట్ రీజనల్ కో–ఆర్డినేటర్ ఎస్.వెంకట్రావు, డీపీఎం అమలకుమారి సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ప్రకృతి వ్యవసాయం వలన రసాయన ఎరువులు, పురుగు మందులపై పెట్టే పెట్టుబడిని పూర్తిగా తగ్గించుకోవచ్చని సూచించారు. ప్రీ మాన్‌సూన్ డ్రై సోయింగ్ విత్తనాల కిట్స్‌లో 30 రకాల విత్తనాలు, 15 కేజీల కిట్‌లుగా తయారుచేసి గ్రామాల్లో సిబ్బంది వద్ద అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. పప్పు దినుసులు, చిరు ధాన్యాలు, నూనెగింజలు, ఆకు కూరలు, తీగజాతి, సుగంధ ద్రవ్యాలు, పచ్చిరొట్ట విత్తనాలు కిట్‌లో ఉంటాయని తెలిపారు. వానకు ముందే విత్తనాలు వేసుకోవడం ద్వారా కలుపు నివారించడంతో పాటు ఆకు కూరలు తీసుకోవచ్చని తెలిపారు. పశువుల మేతగా ఉపయోగించుకోవచ్చని, మిగిలినవి భూమిలో కలియదున్నడం వలన భూసారం పెరుగుతుందని తెలిపారు. కాంపాక్ట్ బ్లాక్‌లు ఏర్పాటుచేసి రసాయనాలు లేని సాగుకు రైతులను ప్రోత్సహించాలని సిబ్బందికి తెలియజేశారు. సమావేశంలో అడిషనల్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ ప్రేమ్‌రాజ్, ఎన్ఎఫ్ఏలు, సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రీజినల్ కో–ఆర్డినేటర్ ఎన్.వెంకట్రావు, చిత్రంలో డీపీఎం అమలకుమారి

జనవిజ్ఞాన వేదిక సభ్యత్వాలు నమోదు

జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు

యడ్లపాడు: జనవిజ్ఞాన వేదిక సభ్యత్వ నమోదు ప్రక్రియను జూలై 15 నాటికి వివిధ విభాగాల ప్రతినిధులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జేవీవీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు దార్ల బుజ్జిబాబు కోరారు. బుధవారం ఆయన మాట్లాడుతూ ఈనెల 23న నెల్లూరు జిల్లాలో జరిగిన జేవీవీ రాష్ట్రస్థాయి సమావేశంలో భవిష్యత్ ప్రణాళికను ప్రకటించామన్నారు. డాక్టర్ గేయానంద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జేవీవీ చేపట్టే పలు కీలక కార్యక్రమాల్ని వెల్లడించారు. జేవీవీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించే చెకుముకి సంబరాలను ఆగస్టు 23న పాఠశాలస్థాయి, సెప్టెంబర్ 10న మండలస్థాయి, అదే నెల 29న జిల్లాస్థాయిల్లో నిర్వహించనున్నట్లు తెలిపారు. అలాగే అక్టోబర్ 19, 20 తేదీల్లో విశాఖపట్నంలో రాష్ట్రస్థాయి చెకుముకి పోటీలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అలాగే జేవీవీ రాష్ట్ర వార్షిక మహాసభలు అనంతరంపురంలో సెప్టెంబర్ 15,16 తేదీల్లో ఉంటాయన్నారు. ఆయా కార్యక్రమాల్ని విజయవంతం చేసేందుకు జేవీవీ ప్రతినిధులు, సభ్యులు సమన్వయంతో కృషి చేయాలని పిలుపునిచ్చారు.



క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించాలి

గుంటూరు మెడికల్: క్యాన్సర్‌ను ప్రాథమిక దశలోనే గుర్తించి చికిత్స అందించడం ద్వారా ప్రాణాలు పోకుండా కాపాడవచ్చని డీఎంహెచ్ఓ డాక్టర్ కొర్రా విజయలక్ష్మి చెప్పారు. బుధవారం గుంటూరు మెడికల్ కాలేజీలో పీహెచ్‌సీ వైద్యాధికారులు, ఎంఎల్‌హెచ్‌పీలు, ఆరోగ్య కార్యకర్తలకు 'సబ్ డిస్ట్రిక్ లెవెల్ క్యాన్సర్ స్క్రీనింగ్ ట్రైనింగ్ ప్రోగ్రామ్' ముగింపు సందర్భంగా డాక్టర్ కొర్రా విజయలక్ష్మి ముఖ్య అతిథిగా మాట్లాడారు. స్త్రీలలో బ్రెస్ట్, సర్వైకల్, నోటి క్యాన్సర్‌ను తొలిదశలోనే గుర్తించడం ఎలా అనే అంశంపై శిక్షణ పొందిన వారు ఇంటింటి సర్వేలో నిశితంగా కేసులను పరిశీలించి గుర్తించాలన్నారు. క్యాన్సర్ వ్యాధి లక్షణాలకు సంబంధించిన ఆరు ప్రశ్నల పత్రాన్ని తీసుకుని వెళ్లి, గృహ సందర్శనలో ప్రశ్నలు అడిగి క్యాన్సర్ కేసులను గుర్తించి చికిత్స కోసం రిఫర్ చేయాలన్నారు. కేసు తీవ్రతను బట్టి పీహెచ్‌సీ, సీహెచ్‌సీ, జిల్లా ఆసుపత్రి, టీచింగ్ ఆసుపత్రులకు రిఫర్ చేయాలన్నారు. కార్యక్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రతినిధి డాక్టర్ రాఘవేంద్ర పాటిల్, డాక్టర్.ఏ. శ్రావణ్ బాబు, డాక్టర్ చుక్క రత్నమన్మోహన్, డాక్టర్ ఈ అన్నపూర్ణ డాక్టర్ గిరిధర్, తదితరులు పాల్గొన్నారు.

పుట్టుకతో వచ్చే లోపాలు సత్వరమే గుర్తించాలి

పుట్టుకతో వచ్చే లోపాలను సత్వరమే గర్తించి చికిత్స అందించాలని డైక్ సెంటర్ ఇన్‌చార్జి డాక్టర్ అమర్తలూరి శ్రావణ్‌బాబు అన్నారు. బుధవారం డీఎంహెచ్ఓ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో డిఫెక్ట్స్, డిలేస్, డిసార్డర్స్, డిసీజెస్ అనే అంశాలపై వైద్యులకు, నర్సింగ్ సిబ్బందికి మూడు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈసందర్భంగా డాక్టర్ శ్రావణ్‌బాబు మాట్లాడుతూ అప్పుడే పుట్టిన పసికందు మొదలు 18 సంవత్సరాల పిల్లల్లో పుట్టుకతో వచ్చే లోపాలపై వైద్య సిబ్బంది అవగాహన కలిగి ఉండాలన్నారు. లోపాలను ఏవిధంగా గుర్తించాలనే విషయాలను వివరించారు. లోపాలు గుర్తించిన వారిని వైద్యం, ఆపరేషన్‌ల కోసం గుంటూరుజీజీహెచ్, తెనాలి జిల్లా ఆసుపత్రి నందలి డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వెన్షన్ సెంటర్లకు పంపాలన్నారు. కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ చుక్కా రత్నమన్మోహన్, డాక్టర్ కె.వి సుబ్బరాజు, డాక్టర్ ఈ అన్నపూర్ణ, డాక్టర్ ప్రియాంక. డాక్టర్ కీర్తి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి

గంజాయి కేసుల్లో నిందితులకు కౌన్సెలింగ్

తెనాలిరూరల్: వ్యసనాలను విడనాడాలని గంజాయి కేసుల్లో నిందితులు, సస్పెక్ట్ షీటర్లకు డీఎస్పీ ఎం. రమేష్ సూచించారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా వ్యతిరేక దినాన్ని పురస్కరించుకుని తెనాలి పట్టణ, రూరల్, కొల్లిపర పోలీస్‌స్టేషన్‌లలో గంజాయి కేసుల్లో నిందితులకు టూ టౌన్ సర్కిల్ కార్యాలయంలో బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించారు. మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాల రవాణా, వినియోగంపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నిషేధిత మాదక ద్రవ్యాల గురించిన సమాచారం అందించిన వారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. డీఎస్పీ వెంట వన్‌టౌన్‌సీఐ జి. దశరథరామారావు, టూ టౌన్ సీఐ ఎ. సుధాకర్, త్రీ టౌన్ సీఐ ఎస్. రమేష్‌బాబు, రూరల్ సీఐ టి. వెంకటేశ్వర్లు, ఎస్ఐ పి. కోటేశ్వరరావు, కొల్లిపర ఎస్ఐ రవీంద్రరెడ్డి, సిబ్బంది ఉన్నారు.



చత్రపతి సాహు మహరాజ్ జయంత్యుత్సవం

నెహ్రూనగర్(గుంటూరు ఈస్ట్): 1902వ సంవత్సరంలో తన రాజ్యంలో బహుజనులకు రిజర్వేషన్లు ప్రవేశపెట్టిన గొప్ప రాజు చత్రపతి సాహు మహరాజ్ అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రజక జన సేవ సంఘం ప్రధాన కార్యదర్శి జూపూడి శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఛత్రపత్తి సాహు మహరాజ్ జయంతిని పురస్కరించుకుని కాకుమాను వారితోటలోని యానాది కాలనీలో ఆయన చిత్రపటానికి బుధవారం రజక నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జూపూడి మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ చత్రపతి సాహు మహరాజ్ రాజ్యంలో చదువుకుని దేశానికి రాజ్యాంగం రాసే స్థాయికి ఎదిగారని గుర్తు చేశారు. బహుజన మహాసభ సెంట్రల్ కమిటీ కార్యదర్శి జీఆర్ భగత్ సింగ్ మాట్లాడుతూ సాహు మహరాజ్ స్ఫూర్తితో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగంలో రిజర్వేషన్లు కల్పించారన్నారు. కార్యక్రమంలో వివిధ బీసీ సంఘాల నాయకులు నిడుముక్కల రాంబాబు, ఈమని ఉమామహేశ్వరరావు, నక్క రవి, వట్టికూటి సాంబయ్య, తదితరులు పాల్గొన్నారు.



చత్రపతి సాహు మహరాజ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

మైక్రో బయాలజీకి ఎన్ఏబీఎల్

గుంటూరు మెడికల్: గుంటూరు వైద్య కళాశాల మైక్రో బయాలజీ వైద్య విభాగానికి నేషనల్ అక్రిడిటేషన్ బోర్డ్ ఫర్ టెస్టింగ్ అండ్ కలాబ్రేషన్ లేబరేటరీస్ (ఎన్ఏబీఎల్) గుర్తింపు మరోసారి లభించింది. గతంలో ఉన్న గుర్తింపును రెన్యూవల్ చేస్తూ బుధవారం ఉత్తర్వులు అందాయి. ఎన్ఏబీఎల్ సర్టిఫికెట్ మైక్రోబయాలజీ విభాగానికి అందడంతో వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ టి.టి.కె.రెడ్డి, మైక్రోబయాలజీ వైద్యులకు అభినందనలు తెలిపారు. మైక్రోబయాలజీ విభాగాధిపతి డాక్టర్ కె. పరమేశ్వరి, ఎస్ఆర్ఎల్ ల్యాబ్ ఇన్‌చార్జి, క్వాలిటీ మేనేజర్ డాక్టర్ ఇజ్రాయల్, మైక్రోబయాలజీ సిబ్బంది టి.ఓ.పవన్‌కుమార్, నాగేశ్వరరావు, ముస్తఫా, మేరి కుమారి, విజయరాణి, శ్రీనివాస్, సుబ్బారావు, విష్ణు, నాగరాజు, ఇతర సిబ్బందికి ప్రిన్సిపాల్, కళాశాల అధికారులు అభినందనలు తెలిపారు.



మైక్రోబయాలజీ గుర్తింపు పత్రాలతో విభాగాధిపతి డాక్టర్ పరమేశ్వరి, డాక్టర్ ఇజ్రాయేల్

ఎమర్జెన్సీ చీకటి శకం



సన్మాన కార్యక్రమంలో ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపిన నేతలు

గుంటూరు మెడికల్: సిటిజన్స్ ఫోరం ఫర్ డెమోక్రసీ కన్వీనర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఈదర శ్రీనివాసరెడ్డి సారథ్యంలో స్థానిక బ్రాడీపేటలోని మాస్టర్ మైండ్స్ విద్యాసంస్థలో బుధవారం ఎమర్జెన్సీ వ్యతిరేక వారంలో భాగంగా సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమర్జెన్సీలో జైలు జీవితం గడిపిన నేతలను సన్మానించారు. సోషలిస్ట్ నేత మోదుగుల పాపిరెడ్డి, ఆర్ఎస్ఎస్ నేతలు మత్రిశంకరరావు, కొల్లిపర శివరామ్, న్యాయవాది పగడాల సాంబశివరావు, మున్నలూరి ఉపేంద్రగుప్తా, వీహెచ్‌పీ నేత చక్కా హరనాథ్‌లను, అజ్ఞానతంగా సేవలందించిన బీజేపీ నేత కొత్తూరు వెంకట సుబ్బారావు, ఏబీవీపీ నేత కోట బ్రహ్మయ్య, కిడాంబి దేవరాజ్‌లను సత్కరించారు. అనంతరం ముఖ్య వక్త, విద్యావేత్త, సంస్కారభారతి దక్షిణ భారత ప్రాంతీయ కార్యదర్శి భైరిశెట్టి మల్లికార్జునరావు మాట్లాడుతూ అధికార దుర్వినియోగం న్యాయస్థానంలో రుజువు కావటంతో తనను ఎవరు ప్రశ్నించరాదని అప్పటి ప్రధాని ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ విధించారని గుర్తుచేశారు. ప్రతిపక్ష నాయకులను జైళ్లలో పెట్టడం, పత్రికా స్వేచ్ఛకు సంకెళ్ళు వేయటం, పౌర హక్కులను రద్దు చేయటం ద్వారా కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేసిందన్నారు. ఇందిరా తనయుడు సంజయ్ గాంధీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లంటూ సాగించిన అమానుషాల వల్ల భారతదేశ పరువు ప్రపంచ దేశాల ఎదుట మంట కలిసిందన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వనమా నరేంద్ర కుమార్, డాక్టర్ కల్లగంటి నాగార్జున, ప్రధాన కార్యదర్శి చరక కమార్ గౌడ్, కంతేటి బ్రహ్మయ్య,పోకూరి జీతేంద్ర, జంధ్యాల రామలింగ శాస్త్రి, ఆవుల రాము, నడ్డి నాగ మల్లీశ్వరి,స్టాలిన్, డాక్టర్ స్రవంతి, మహాలక్ష్మి, వాణి నిర్మల, అంకాల శ్రీను, సురేష్ జైన్, వెంకట రమణ, సాధు రామకృష్ణ, పురుషోత్తం, నరేష్, కమల్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.